పేదవాడికి అండగా జగనన్న ప్రభుత్వం


లబ్ధిదారులకు జగనన్న సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : జగనన్న ప్రభుత్వం ప్రతి పేద వాడికి అండగా ఉంటూ వారికి సంక్షేమ ఫలాలు అందజేస్తోందని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం స్థానిక శ్రీమిట్టమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి ఇస్లాంపురం ప్రాంతాల్లో ఆయన నిర్వహించారు. ప్రతి ఒక్క కుటుంబాన్ని పలకరించి జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలును, అందిన పథకాలను వివరించారు. ఇంకా ఎవరికైనా పథకాలు అందకపోతే తెలపాలన్నారు. ఇస్లాంపురంలో నెలకొన్న సమస్యలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకుని వాటిని అక్కడికక్కడే పరిష్కరించారు. జగనన్న ప్రభుత్వానికి అండగా ఉండి మరిన్ని పథకాలను అందుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, కౌన్సిలర్లు ఖాదర్‌బాషా, పార్నపల్లి కిశోర్, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రైతు కళ్లల్లో ఆనందం


చిన్నప్ప ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహిస్తున్న రైతులు

పులివెందుల రూరల్ : స్థానిక మార్కెట్‌యార్డులోకి సుమారు 10 మంది రైతులు పండించిన 23 టన్నుల చీనీకాయలను విక్రయించడానికి గురువారం మార్కెట్‌కు తీసుకువచ్చారు. మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ చిన్నప్ప ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీనీకాయలకు వేలంపాట నిర్వహించగా టన్ను రూ.23 వేలు ధర పలికిందన్నారు. రైతులు తెచ్చిన చీనీ కాయలను బట్టి వేలంపాటలో పాల్గొనడం జరిగిందన్నారు. రైతులు తెచ్చిన చీనీ కాయలలో మంగు, మడప, మెత్తని, ఎండబెట్టు, బొబ్బర్లు తదితర కాయలను వేరుచేసి వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో వ్యాపారులు పాడిన ధరకు కాయలు కొనుగోలు చేయడంతో రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. సూట్ కమీషన్ లేకుండా చీనీకాయల కొనుగోలు కేంద్రాలు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల సహకారంతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చీనీ రైతులను గతంలో టన్ను సూట్ తీసుకుని వ్యాపారులు కాయలు కొనుగోలు చేసేవారన్నారు. ఇప్పుడు సూట్ లేకుండా చీనీ కాయలు పులివెందుల మార్కెట్‌యార్డులో కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపడం చాలా అభినందనీయమన్నారు.

ధూపదీప నైవేద్యం కోసం దరఖాస్తు చేసుకోండి

పులివెందుల రూరల్ : నియోజకవర్గంలో గ్రామాల పరిధిలోని ఆలయాలకు సంబంధించి ధూపదీప నైవేద్యం కింద ఆర్థిక సాయం కావలసిన వారు దరఖాస్తు చేసుకోవాలని పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు అన్ని పత్రాలతో పాడా కార్యాలయం నందు సంప్రదించాలన్నారు. కార్యాలయంలో ఉన్న ఏవో ప్రభాకర్‌రెడ్డిని సంప్రదిస్తే అక్కడికి ఎండోమెంట్ సంబంధించిన అధికారులు కూడా వస్తారన్నారు. ధూపదీప నైవేద్యానికి సంబంధించిన అప్లికేషన్ సంబంధిత పత్రాలను అక్కడే ఎండోమెంట్ అధికారులకు అందజేస్తే వారు పరిశీలించి మంజూరుకు అధికారులకు పంపిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


ఇసుకపల్లెలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ చంద్రమోహన్

పెండ్లిమర్రి : మండలంలోని 44 పోలింగ్ కేంద్రాలను గురువారం డిప్యూటీ కలెక్టర్ చంద్రమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, వాటర్ సౌకర్యం, బాత్ రూమ్‌లు వంటి మౌలిక వసతులు ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. అలాగే ఫారం-6, కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన ఓటర్ల వివరాల నమోదును పరిశీలించారు. అనంతరం పోలింగ్ బూత్ లెవల్ ఆఫీసర్‌లతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు పాల్గొన్నారు.

పరామర్శ

వీరపునాయునిపల్లె : ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి వ్యక్తిగత సహాయ కార్యదర్శి బైరెడ్డి కిషోర్‌కుమార్ రెడ్డి తండ్రి వెంకటరెడ్డి బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి స్వగ్రామమైన గంగిరెడ్డిపల్లెకు వచ్చి వెంకటరెడ్డి పార్థీవ దేహంకు నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నిర్వహించిన అంతక్రియల్లో చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజుల్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేములలో..

వేముల : మండలంలోని బచ్చయ్యగారిపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చల్లా వెంకటయ్య(90) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి వెంకటయ్య మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ చల్లా గంగాదేవి, జడ్పీటీసీ వెంకటబయపురెడ్డి, పీసీబీ డైరెక్టర్ మరక శివకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు

వల్లూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండలస్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. ఇందులో వేదాస్ పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో, వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రెండవ స్థానంలో, గంగాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మూడవ స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుపాల్‌రెడ్డి తెలిపారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి

వల్లూరు : వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ పెద్ద ఓబన్న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో తెలిపారు. విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా పర్మిషన్ తీసుకోవాలన్నారు.

చెన్నూరు : మండల ప్రజలు వినాయక చవితి పండుగను ఐక్యతతో సోదర భావంతో నిర్వహించుకోవాలని రూరల్ సీఐ విజయ్‌భాస్కర్‌గౌడ్ అన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐ శ్రీనివాసరెడ్డి నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

'కాపులు పవన్‌కళ్యాణ్‌ను నిలదీసే రోజులు వచ్చాయి'

వేంపల్లె : కాపు సోదరులు జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌ను నిలదీసే రోజులు దగ్గరపడ్డాయని రాష్ట్ర హజ్‌హౌస్ కమిటీ డైరెక్టర్ మునీర్ తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కరప్షన్ కింగ్‌తో ప్యాకేజీ కింగ్ పవన్‌కళ్యాణ్ కలిసి మరోసారి జనసైనికులను మోసం చేశారన్నారు. పవన్‌కళ్యాణ్ ఎక్కడ సభలు పెట్టినా సీఎం.. సీఎం అంటూ కేకలు వేసే జనసైనికులు సీఎం క్యాండెట్ ఎవరో బహిరంగంగా తెలపాలంటూ నిలదీయాలన్నారు. చంద్రబాబును సీఎం చేయడానికి జనసేన పార్టీని హోల్‌సేల్‌గా అమ్మేశాడన్నారు. అవినీతి చక్రవర్తి చంద్రబాబును రాజమండ్రి సెంట్రల్ జైల్లో కలిసి చంద్రబాబు ఇచ్చే 10, 15 సీట్ల కోసం కార్యకర్తల, కాపు సోదరుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితే వీరిద్దరి భవిష్యత్తు శూన్యం అవుతుందని తెలిసి ప్రజల భవిష్యత్తు కోసమే కలిశానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

ఇసుక తవ్వకాలను అడ్డుకున్న ప్రజలు

వేంపల్లె : స్థానిక పాపాఘ్ని నదిలో గురువారం అక్రమంగా ఇసుకను తరలించేందుకు వచ్చిన టిప్పర్లను రైతులు, ప్రజలు అడ్డుకోవడంతో వచ్చిన టిప్పర్లు వెనుతిరిగాయి. ఎలాంటి అనుమతులు లేకుండా ఎవరూలేని సమయంలో రాత్రిపూట జేసీబీతో ఇసుక తవ్వకాలు చేసి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని ప్రజలు తెలిపారు.

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి

వేంపల్లె : విద్యార్థుల్లో పోటీతత్వం ఉన్నప్పుడే వారిలో ఉన్న నైపుణ్యాన్ని బయటికి తెచ్చేందుకు వీలు ఉంటుందని పాఠశాల హెచ్‌ఎం శివమునెమ్మ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హిందీ దినోత్సవం సందర్భంగా హిందీ దివాస్ అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. గాంధీజీ స్ఫూర్తితో 1949 సెప్టెంబరు 14న రాజ్యాంగంలోని 351వ అధికరణం 8వ షెడ్యూల్‌లో హిందీని కేంద్ర ప్రభుత్వ అధికార భాషగా గుర్తించిందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కమలాపురం : పట్టణ పరిధిలోని 14వ వార్డు 4వ అంగన్‌వాడీ సెంటర్‌ను గురువారం డీఎంహెచ్‌ఓ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం గురించి వివరాలను వర్కర్ సునీతను అడిగి తెలుసుకున్నారు.

పంటనమోదు పరిశీలన

ముద్దనూరు : ఖరీఫ్ సాగులో పంటనమోదు కార్యక్రమాన్ని భూసంరక్షణ విభాగపు ఏడీఏ అనిత గురువారం పరిశీలించారు. మండలంలోని మంగపట్నం గ్రామ పరిధిలో పంట నమోదు చేసిన రికార్డులను మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డితో కలిసి ఆమె పరిశీలించారు.

సింహాద్రిపురం : మండలంలో చవ్వారుపల్లె, నంద్యాలపల్లె, తెలికి, పైడిపాలెం గ్రామాల్లోని రైతులు వేసిన ఖరీఫ్ పంటలను గురువారం కడప భూసార పరిరక్షణ ఏడీఏ అనిత, ఆర్బీకే అసిస్టెంట్లతో కలిసి పరిశీలించారు.

నూతన పింఛన్ల పంపిణీ

వీరపునాయునిపల్లె : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా నూతనంగా వికలాంగులు, వితంతువులు, వృద్ధులకు 369 మంది కి పింఛన్లు మంజూరయ్యాయన్నారు.

రైతు భరోసా కేంద్రాల తనిఖీ

వేంపల్లె : మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల పనితీరును గురువారం మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్ పరిశీలించి మాట్లాడారు. ఈ క్రాప్ పంట నమోదులో జిల్లాలో వేంపల్లె మండలం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సాగులో ప్రతి రైతు తమ పంటలను ఈ క్రాప్ నమోదును తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. ఉద్యాన పంటలను సెప్టెంబర్ 15వ తేదీలోగా ఈ క్రాప్ పూర్తిచేయాలన్నారు. అలాగే మండలంలోని వెలమవారిపల్లె, కత్తులూరు, వేంపల్లె గ్రామాల్లోని పంట నమోదు చేసిన పొలాలను కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వారి ఆదేశానుసారంగా తనిఖీ చేస్తున్నామన్నారు. చీనీతోటల్లో వేసిన అంతర్ పంటలను తనిఖీ చేశామన్నారు. ఇప్పటివరకు మండలంలో 11వేల ఎకరాలలో పంటనమోదు చేశామని తెలిపారు.

రైతు భరోసా అందని వారిని గుర్తించండి

లింగాల : అర్హత ఉండి ఏ రైతుకైనా ఇప్పటి వరకు రైతు భరోసా పడకపోయినా, కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతులు ఉన్నా, చనిపోయిన రైతుల వారి కుటుంబ సభ్యులను నామినీగా ప్రకటించి మళ్లీ రైతు భరోసా నమోదు చేయడానికి అవకాశం వచ్చిందని ఏఓ రమేష్ తెలిపారు. వలంటీర్లు అలాంటి రైతుల వద్ద ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్‌లను తీసుకుని ఆర్బీకే వద్ద నమోదు చేయించాలన్నారు.